ప్రజాశక్తి
శనివారం 13 జులై 2024
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





అదానీ ఫైలు క్లియర్ !

- డేటా సెంటర్‌కు ఐటి హిల్ నెంబర్ 4పై 130 ఎకరాలు
- పలు విషయాలపై ఆరా తీసిన సిఎం చంద్రబాబు



అదానీ డేటా సెంటర్‌కు కేటాయించిన హిల్ నెంబర్ 4 (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ నెల 11న జరిపిన సుడిగాలి పర్యటనలో అదానీ డేటా సెంటర్ ఫైలుకు క్లియరెన్స్ లభించింది. తాజా పర్యటనలో అనేక అంశాలపై అధికారులను బాబు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల దశ, భూముల కేటాయింపు, అక్కడ ప్రస్తుతం ఏం జరుగుతుందన్న అంశాలపై దృష్టిసారించినట్లు కనిపిస్తోంది. జగన్ ప్రభుత్వంలో గౌతమ్ అదానీకి ఐటి హిల్ నెంబరు 4పైన 130 ఎకరాలను క్లౌడ్ కంప్యూటరింగ్, డేటా సెంటర్ కోసం కేటాయించిన సంగతి తెలిసిందే. ఎయిర్ పోర్టులో గురువారం సాయంత్రం అధికార యంత్రాంగంతో నిర్వహించిన సమీక్షలో అదానీ ఫైలు గురించి పరిశ్రమల శాఖ, ఎపిఐఐసి అధికారులను బాబు పలు వివరాలు అడిగారు. అన్నింటినీ క్షుణ్ణంగా ఆరా తీశారు. ఎండాడ లా కాలేజీ నుంచి దిగువ రోడ్డులోగల పనోరమ హిల్స్ ఎడమ వైపుగల 287 ఎకరాల ప్రభుత్వ కొండపై అదానీ డేటా సెంటర్ కోసం గతంలోనే 130 ఎకరాలు కేటాయించారు. దీనిపై సిఎం చంద్రబాబు స్పందిస్తూ 25 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని, దీనికి సంబంధించిన క్లియరెన్స్‌లన్నీ చేయాల్సిన అవసరం ఉందని చెబుతూ పలు సూచనలు చేశారు.

కొత్త ఇండస్ట్రియల్ పాలసీ వస్తుందా ?

అధికార యంత్రాంగం, ముఖ్యంగా ఇండస్ట్రీస్, ఎపిఐఐసి అధికారులు కొత్త ఇండస్ట్రియల్ పాలసీ వస్తుందని ఎదురు చూస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల శాఖకు కొత్తగా డైరెక్టర్‌ను కూడా నియమించింది. మరో వారం రోజుల్లో న్యూ ఇండస్ట్రియల్ పాలసీ వస్తే గతంలో అదానీ సెంటర్ కోసం చేసిన భూ కేటాయింపులు వంటివి రద్దవుతాయని సంబంధిత అధికారులు భావించారు. కాగా స్వయంగా ముఖ్యమంత్రే ఆసక్తిగా అదానీ డేటా సెంటర్ ల్యాండ్ వివరాలు అడిగి అక్కడ ఖాళీ స్థలం ఇంకెంత ఉందన్న అంశాలపై చర్చించడంతో అదానీ ఫైలు క్లియర్ అయ్యిందన్న అంచనాకు వచ్చారు. గత ప్రభుత్వం సింగిల్ విండో పద్ధతిలో కొత్త పరిశ్రమలకు క్లియరెన్స్ ఇచ్చింది. 2019 ముందు చంద్రబాబు హయాంలోనూ ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో పరిశ్రమలకు క్లియరెన్స్‌లు ఇవ్వడం తెలిసిందే. పరిశ్రమలకు స్థలాల కేటాయింపులో ఈ ప్రభుత్వాల మధ్య మిగతా 2లో..



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

నాణ్యమైన ఆహారం అందించాలి

కలెక్టర్ హరీంద్ర ప్రసాద్
మల్కాపురం జివిఎంసి హైస్కూల్లో విద్యార్థులతో కలిసి సహఫంక్తి భోజనం

ప్రజాశక్తి - ములగాడ : పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరీంద్ర ప్రసాద్ నిర్వాహకులను ఆదేశించారు. పౌష్టిక విలువలతో కూడిన భోజనం సమకూర్చాలని, నిర్ణీత సమయానికి అందజేయాలని సూచించారు. ఆయన శుక్రవారం మల్కాపురం ప్రకాష్ నగర్‌లో ఉన్న జివిఎంసి హైస్కూల్‌ను, త్రినాధపురంలోని పాఠశాలను సందర్శించారు. ప్రకాష్ నగర్‌లోని జివిఎంసి హైస్కూల్‌లో విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహఫంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బయట ప్రదేశంలో భోజనం పెట్టరాదన్నారు. డైనింగ్ హాల్‌లో భోజనం ఏర్పాటు చేయాలని లేదా క్లాస్ రూమ్‌లోనే భోజనం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కాసేపు కుశల ప్రశ్నలు వేసి విద్యార్థులతో సందడిగా గడిపారు. బాగా చదువుకోవాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, ఎస్-ఎస్ఎ ఎపిసి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో సహకరించండి

వార్త 2లో..

'ఉక్కు' ప్రైవేటీకరణను విరమించుకోవాలి

వార్త మెయిన్‌లో..

ఎయు మాజీ విసి అక్రమాలపై ధర్నా

వార్త 2లో..

అభివృద్ధిపై బాబు మాటలు హాస్యాస్పదం

మాజీ మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో చేసిన అభివృద్ధి పనులన్నింటినీ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను చేసినట్టుగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు వచ్చే ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడటం మానేసి జగన్మోహన్ రెడ్డిపై విష ప్రచారానికి దిగడం దారుణమన్నారు. ఇప్పటి వరకూ వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని తనదిగా చెప్పుకుంటూ రాష్ట్ర ప్రజలను ఆయన మభ్యపెడుతున్నారని విమర్శించారు. మోసపూరిత మార్కెటింగ్ స్కిల్స్ చంద్రబాబు సొంతమని ఎద్దేవా చేశారు. 2014 - 19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కేవలం ఒక ప్రాంత అభివృద్ధికి మాత్రమే పనిచేసి ఇప్పుడు ఉత్తరాంధ్రపై సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు ఇంత శరవేగంగా జరగడానికి జగన్మోహన్ రెడ్డినే కారణమన్నారు. ఎన్‌జిటిలో ఉన్న కేసులను కూడా అధిగమించి మిగతా 2లో..

గంజాయి మత్తులో చోరీలు

పకడ్బందీ వ్యూహంతో ముఠాను అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురువారం అర్ధరాత్రి గంజాయి సేవించి హైవేపై వెళ్తున్న వాహనంపై దాడి చేసి చోరీకి పాల్పడిన ముఠాను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. విశాఖ క్రైమ్ డిసిపి పి.వెంకటరత్నం శుక్రవారం సాయంత్రం ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి ఎండాడ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఒంటి గంటన్నర ప్రాంతంలో అటుగా వెళుతున్న లారీని ఆపి డ్రైవర్‌పై కొంతమంది దాడి చేశారు. అతని నుంచి రూ.10 వేల నగదు, మొబైల్ దొంగిలించారు. వారిని 24 గంటలు గడవకముందే పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ఐదు బృందాలుగా గాలించి పట్టుకున్నారు. విచారణలో భాగంగా మరొక ఏడుగురిని పిఎం.పాలెం ప్రాంతంలోని



కేసు వివరాలు వెల్లడిస్తున్న క్రైమ్ డిసిపి వెంకటరత్నం

ఆర్‌హెచ్ కాలనీలో అరెస్టు చేశారు. వీరంతా వ్యసనాలకు బానిసై, సరదాల కోసం దొంగతనాలు చేస్తున్నారని డిసిపి తెలిపారు. అరెస్టయిన వారిలో తోట నాగరాజు, తోట దుర్గా ప్రసాద్, బొత్స హరీష్, అరుగుల్ల భాను, మెరుగు నరసింహులతో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అదానీ ఫైలు క్లియర్ !

పెద్ద తారతమ్యం ఏమీ కానరావడం లేదు. ఇదిలా ఉండగా విశాఖకు పెద్దగా పరిశ్రమలేవీ ఈ కాలంలో రాలేదని, అనకాపల్లి జిల్లాలో భూమి విస్తారంగా ఉన్నందున అటు తరలిపోతున్నాయని 'ప్రజాశక్తి'కి ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.

అభివృద్ధిపై బాబు మాటలు హాస్యాస్పదం

35 శాతం పనులు చేశామన్నారు. మూలపేట పోర్టు, ఫిషింగ్ హార్బర్‌లు, మెడికల్ కాలేజీల నిర్మాణానికి అంకురార్పణ తమ హయాంలోనే జరిగిందన్నారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆంధ్ర యూనివర్సిటీలో తొలి క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తానని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ నేటికీ ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదని తెలిపారు. బిపిసిఎల్ కర్మాగారం రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు కొద్ది రోజులుగా చంద్రబాబు ప్రభుత్వం విపరీతమైన పబ్లిసిటీ ఇస్తోందని, ఆ కంపెనీ యాజమాన్యం మరికొన్ని రాష్ట్రాలలో కూడా అందుకోసం స్థలాలను పరిశీలిస్తోందని అమర్‌నాథ్ తెలిపారు. సూపర్ సిక్స్‌లో భాగంగా చంద్రబాబు పేర్కొన్న తల్లికి వందనం పథకంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇసుక ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించి రకరకాల ఛార్జీలు కలిపి టన్నుకు రూ.1400 వసూలు చేస్తోందని తెలిపారు. విద్యుత్ ఛార్జీల విషయంలో కూడా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి వైసిపి కార్యకర్తలపై, వారి ఆస్తులపై దాడులకు పాల్పడుతున్నారని, ఒక పత్రిక కార్యాలయంపై ఇటీవల దాడి చేసి, మీడియాను కూడా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇటువంటి చర్యలను మానుకోవాలని హితవు పలికారు.

గంజాయిమత్తులో చోరీలు

పాటు మరో ముగ్గురు జువైనల్ నిందితులు ఉన్నారు. వారి నుంచి నాలుగు బైకులు, ఐదు వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో క్రైమ్ ఎసిపి ఎ.వెంకట్రావు, ఈస్ట్ క్రైమ్ సిఐ ఎస్.ఆడమ్, అరిలోవ క్రైమ్ ఎస్ఐ హరి పాల్గొన్నారు.

పరిశుభ్రత కీలకం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వీధులు, డ్రెయిన్ల పరిశుభ్రత విషయంలో రాజీవద్దని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా చూడాలని జివిఎంసి అధికారులను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం 35వ వార్డులో ఆయన పర్యటించారు. జోనల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది, వివిధ విభాగాల అధికారులతో కలిసి వార్డులో పలు ప్రాంతాలు తిరిగి ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు టిడిపి అధ్యక్షులు బుచ్చా రామిరెడ్డి, జనసేన అధ్యక్షులు త్రినాథ్ పాల్గొన్నారు.



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, జెసి మయూర్ అశోక్

ఎంవిపి రైతు బజారులో ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నిత్యావసర సరుకులను ప్రజలకు తక్కువ ధరలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం ఎంవిపి.కాలనీ రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్‌ను విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రారంభించారు. స్టీమ్డ్ బిపిటి సన్న బియ్యాన్ని కిలో 49కి, కందిపప్పును రూ.160కి విక్రయించేందుకు దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ అధికారి జి.ప్రసాద్, వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, పోలారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్య ప్రకాష్, రైతు బజార్ సహాయకులు జి.కనకరాజు పాల్గొన్నారు.

ఎయు మాజీ విసి అక్రమాలపై ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ విసి ప్రసాద్ రెడ్డి హయాంలో జరిగిన అక్రమాలను తవ్విన కొద్దీ మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని యూనివర్సిటీ పరిరక్షణ సమితి సభ్యులు డాక్టర్ సురేష్ మీనన్, డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి సభ్యులు తెలుగు విభాగం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షురాలు లక్ష్మీపార్వతిని తెలుగు విభాగం ప్రొఫెసర్‌గా నియమించడం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దాస్, డాక్టర్ సూరి, డాక్టర్ మంజుల, డాక్టర్ భాను పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో సహకరించండి

- సిఐఐని కోరిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యదర్శి సౌరవ్ గౌర్



సెమినార్‌కు హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నైపుణ్యాభివృద్ధిలో ప్రభుత్వానికి సహకరించాలని ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సౌరభ్ గౌర్ కోరారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ 'ఇండియన్ ఎకోసిస్టమ్ నీడ్స్ ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్' అనే థీమ్‌తో సెకెండ్ ఎడిషన్ హెచ్ఆర్ సెమినార్‌ను శుక్రవారం ఉదయం విశాఖలోని నోవటల్ హోటల్‌లో నిర్వహించింది. దీనికి ఆయన వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన నైపుణ్య గణన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని నైపుణ్యత కలిగిన వారిని గుర్తించి వారికి ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం కృషి చేయనుందన్నారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సిఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కావాలంటే మరిన్ని పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన అవసరమన్నారు. వ్యాపారాలు లాభాల బాటలో ఉంటేనే పెట్టుబడులు వచ్చే అవకాశముందన్నారు. పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన ఉద్యోగుల అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిశ్రమలను, విద్యాసంస్థలను ఒక తాటిపైకి తీసుకువచ్చి ఏ విధంగా విద్యార్థులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలో ఈ సదస్సు తెలియజేసిందన్నారు. అనంతరం నేషనల్ నెంబర్ 1 బెస్ట్ సెల్లింగ్ రచయిత, చాణక్య ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీడర్‌షిప్ స్టడీస్ డైరెక్టర్ డాక్టర్ రాధాకృష్ణన్ పిళ్లై రచించిన 'కార్పొరేట్ చాణక్య' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐఐ సదరన్ రీజియన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పద్మ కుమార్, ప్రముఖ వ్యూహకర్త కె.శ్రీనివాసరావు, కాంటర్ సంస్థ హెచ్ఆర్ డైరెక్టర్ అతుల్ నషీన్, ఆత్మన్ రామాయణ్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు శశిధర్ అంబటిపూడి, ఇన్వెస్కో లిమిటెడ్ హెచ్ఆర్ డైరెక్టర్ ప్రత్యూష శర్మ, ఐటిసి లిమిటెడ్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ సహాయ్ చౌదరి పాల్గొన్నారు.

నేడు ఎపిడబ్ల్యుజెఎఫ్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌ల విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం దొండపర్తి సింకా గ్రాండ్ హోటల్లో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షులు పి.నారాయణ తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం ఒక హోటల్‌లో ప్రస్తుత కార్యవర్గ సభ్యులుతో చర్చించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ శనివారం ఉదయం శ్రీకన్య థియేటర్ వద్దనున్న సింకా గ్రాండ్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించి సమావేశంలో తీర్మానం చేస్తామన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు.

బోధనాంశంగా మనుస్మృతి తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఢిల్లీ యూనివర్సిటీ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో మనుస్మృతిని బోధనాంశంగా ప్రవేశపెట్టేందుకు ఢిల్లీ యూనివర్సిటీలోని లా ఫ్యాకల్టీ చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని భారత నాస్తిక సమాజం నాయకులు జె.రవి, టి.శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. లీగల్ మెథడ్‌గా పిలిచే కేటగిరీ కింద దీన్ని తీసుకురావడాన్ని ఆపాలన్నారు.

సమాజంలోని సామాజిక, ఆర్థిక అసమానతలను ప్రేరేపించే, మరింత బలోపేతం చేసే మనుస్మృతిని సవరించిన సిలబస్ డాక్యుమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారన్నారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హెల్మెట్ ఆవశ్యకతపై శుక్రవారం ద్వారకా బస్సు స్టేషన్‌లో విశాఖపట్నం జిల్లా న్యాయ సేవల అథారిటీ (డిఎల్ఎస్ఎ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎం.శేషమ్మ, ఇతర న్యాయాధికారులు, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ. అప్పలరాజు పాల్గొన్నారు.

తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతుబజారు, ఇతర చోట్ల ప్రత్యేక కౌంటర్లు


పెందుర్తిలో కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 96వ వార్డు పెందుర్తి రైతు బజార్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు ప్రజలకు అందజేసేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న పప్పులు, బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలను దృష్టిలో పెట్టుకుని అవి అదుపులోకి వచ్చేంతవరకు సామాన్యులకు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం ఈ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఆరవ జోన్ కమిషనర్, పౌరసరఫరాల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధార, అక్కయ్యపాలెం, కంచరపాలెం రైతు బజార్లలో పౌరసరఫరాలశాఖ ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం అమ్మకాల ప్రత్యేక కౌంటర్లను ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర కిలో రూ.180లకు పైబడి ఉందని, ప్రత్యేక కౌంటర్లలో రూ.160కే అందిస్తారన్నారు. అలాగే నాణ్యమైన బియ్యాన్ని కిలో రూ.49కే ఇస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి, కార్పొరేటర్లు పద్మారెడ్డి, కంపా హనోక్, చిల్లా రజని, వసంతరావు, సురేష్‌బాబు, దివాకర్, రాంబాబు, సాగర్, కార్తీక్, అప్పన్న, శంకర్, త్రినాధ్, ముత్యాల నాయుడు, వీరన్న చౌదరి పాల్గొన్నారు.

ములగాడ : ములగాడ రైతు బజారులో బియ్యం, కందిపప్పు విక్రయాల ప్రత్యేక కౌంటర్‌ను ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే ఈ కౌంటర్లలో కందిపప్పు, బియ్యం విక్రయిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక తహశీల్దార్, జనసేన నేతలు ఎ.ప్రశాంతి, రామకృష్ణ, టిడిపి నేతలు మజ్జి సోమేష్, నక్క లక్ష్మణరావు, మాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : ధరలు నియంత్రణలో భాగంగా పట్టణంలోని మెయిన్ రోడ్లో శుక్రవారం కందిపప్పు, బియ్యం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అనకాపల్లి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కెవిఎల్‌ఎన్ మూర్తి అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన కందిపప్పు కేజీ రూ.160, బియ్యం కేజీ రూ.49కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. శనివారం అనకాపల్లి మెయిన్ రోడ్‌లో శ్రీధరాల జోగారావు షాపు వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏఎస్‌ఓలు కళ్యాణి, నందకిషోర్, సిఎస్‌డి టి లీల శేషు కుమారి, అనకాపల్లి రైస్, డాల్ మర్చంట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శ్రీధరాల సోమరాజు, అధ్యక్షులు బొడ్డేడ శంకర్రావు, కార్యదర్శి గుండా సాయి, కోశాధికారి బచ్చు రామకృష్ణ పాల్గొన్నారు

పర్యావరణ హితంగా కాగితపు సంచులు



కాగితపు సంచుల తయారీలో ఛాత్రోపాధ్యాయులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కాగితపు సంచులు పర్యావరణానికి మేలు చేస్తాయని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎం జ్యోతి కుమారి అన్నారు శుక్రవారం స్థానిక ప్రభుత్వ డైట్‌లో ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్తా పత్రికలు, వాడేసిన కాగితాలతో వివిధ సంచులను ఛాత్రోపాధ్యాయులు తయారు చేసి పంచిపెట్టారు .కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, అధ్యాపకులు ఎల్ సుధాకర్, గొట్టేటి రవి, ఎం మహాలక్ష్మి, సోమయాజులు పాల్గొన్నారు

విపత్తుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం: విపత్తుల నివారణ, వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహనా కల్పించారు. విశాఖ ఎన్‌డిఆర్‌ఎఫ్ టెన్త్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ గాదె ఈశ్వరరావు, బృంద సభ్యులు పాల్గొని,. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స చేయడంపైప్రయోగాత్మకంగా వివరించారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ ఎస్ అప్పలనాయుడు, ఎస్ శ్రీను, ఎన్‌సిసి కేర్‌టేకర్ వై.వెంకటరావు, అధ్యాపకులు పాల్గొన్నారు

జగన్నాథునికి పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి- సింహాచలం : స్థానిక టర్నర్ సత్రం కల్యాణ మండపంలో కొలువై, నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామికి శుక్రవారం సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాస్‌మూర్తి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ ఆలయ ప్రధాన అర్చకులు రమణమూర్తి, అర్చక స్వాములు, ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి ఆనందకుమార్, పర్యవేక్షణ అధికారి పిల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో 'నానో జాతా'



డాక్టర్ రామకృష్ణ మత్తేను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : నానో సైన్స్ టెక్నాలజీపై సైన్స్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో అవగాహన పెంచడానికి బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ (సెన్స్), గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నానో జాతా పేరిట ప్రత్యేక వర్క్‌షాప్‌ను శుక్రవారం నిర్వహించింది. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 250 మందికి పైగా విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెన్స్ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ హెచ్.ఎస్.ఎస్.రామకృష్ణమత్తే విద్యార్థులకు నానో సైన్స్‌లో ప్రాథమిక అంశాలతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలను వివరించారు. భవిష్యత్తులో నానో టెక్నాలజీ ఆధారంగా మానవ శరీరంలో ఔషధాలను పంపడానికి నానో రోబోట్‌లను వాడుతారన్నారు. అలాగే జన్యువుల ఎడిటింగ్, త్రిడి ప్రింటింగ్‌లలో నానో టెక్నాలజీ కీలక పాత్ర పోషించనున్నదని తెలిపారు. హోమీబాబా నేషనల్ ఇనిస్టిట్యూట్ (ముంబై) విశ్రాంత ప్రొఫెసర్, గీతం విశిష్ట ప్రొఫెసర్ బివిఆర్ టాటా నానో సైన్స్‌కు చెందిన పదార్థ విజ్ఞానం గురించి వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, గీతం రీసెర్చి డెవలప్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ విఎన్. సత్యనారాయణ, సీనియర్ ప్రొఫెసర్‌లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నానో సైన్స్‌పై క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

నారుమడి యాజమాన్యంపై అవగాహన


నారుమడిలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు

ప్రజాశక్తి-పద్మనాభం : వరి నారుమళ్ల తయారీలో సక్రమ యాజమాన్య పద్ధతులను పాటిస్తే, ఎటువంటి చీడపీడలు ఆశించని ఆరోగ్యకరమైన వరినారును నాటేందుకు సిద్ధం చేయవచ్చని మండల వ్యవసాయాధికారి ఎంవిఎన్ చలం రైతులకు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరినారు మళ్లను సిద్ధం చేయడంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. వరినారు తయారీలో పది యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నారుమళ్లలో వరి విత్తనాలు చల్లే ముందు కార్బండైజమ్, సూడోమెనోస్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలని, మందు కలిపిన విత్తనాలను ఒకరోజంతా నానబెట్టి, తర్వాత రోజు మడికట్టుకోవాలన్నారు. వారం రోజులపాటు నారు మడికి నీరు కట్టి, తీస్తూ ఉండాలన్నారు. నారు మడిలో కలుపు వచ్చే అవకాశం ఉంటే, బూటాక్లోర్ కలుపు మందును 5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. నారు మడిలో రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, రెండు కిలోల పొటాష్ చల్లుకోవాలని, తద్వారా నారు ఏపుగా పెరుగుతుందన్నారు. వారం రోజుల తరువాత మడిలో వరినారు ఎర్రగా కనిపిస్తే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 25 రోజుల వయసున్న నారును నాటితే, అప్పుడే అధికంగా పిలకలు వచ్చే ఛాన్స్ ఉందన్నారు..దమ్ము మడిలో నాట్లు పైపైనే వేయాలన్నారు. దీని వల్ల పక్క నుంచి పిలకలు ఎక్కువగా వృద్ధి చెందుతాయన్నారు. మరో వారంరోజుల్లో నారు తీస్తామనగా, ఐదు సెంట్లు నారుమడిలో 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ వాసన రాని గుళికలను వేసుకోవాలి. దీని వల్ల నాట్లు వేసిన తరువాత పోలంలో నెల రోజుల వరకు ఎటువంటి చీడపీడలు ఆశించవన్నారు. నారు తీసేటప్పుడు వేర్లు తెగిపోకుండా ఉండాలంటే, నారు మడిలో పల్చగా నీరు పెట్టి, నాడు కేజీల కళ్లు ఉప్పు వేసుకోవాలన్నారు. ని వల్ల భూమి గుల్లబారి, వేర్లు తెగకుండా నారు వస్తుందన్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే 80శాతం వరకు నారుమళ్లలో వరి విత్తనాలు చల్లారని, వితేముందు వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయని ఎఒ చలం సూచించారు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంంలోని శొంఠ్యాం పంచాయతీ ఆబోతువానిపాలెం గ్రామం సమీపంలో గుర్తుతెలియని వద్ధుడు వ్యక్తి మృతదేహం లభ్యమైందని స్థానిక పోలీసులు తెలిపారు వివరాలివి. ఆబోతువానిపాలెం సర్వే నెంబర్ 16లో బొద్దపు తాతారావు నీలగిరి తోటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని అటుగా వెళ్తున్న పశువుల కాపరి గవరపు సూర్యనారాయణ చూసి వెంటనే స్థానిక విఆర్‌ఒ కె.అప్పారావుకు సమాచారం తెలియజేశాడు. ఈ మేరకు ఘటనాస్థలికి చేరుకున్న విఆర్‌ఒ, దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ టివి. తిరుపతిరావు, ఎస్‌ఐ సంతోష్, ఎఎస్‌ఐ నూకరాజు, ఇతర సిబంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు కోసం చుట్టుపక్కలా గాలించి, వాకబుచేసినా ఎటువంటి సమాచారం తెలియలేదు.మృతుని వయస్సు 65ఏళ్లు ఉంటుందని,వారం రోజులుగా ఇదే ప్రాంతంలో సంచరిస్తున్న వృద్ధుడు ఆకలికి తట్టుకోలేక చనిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.కేసు నమోదుచేసి, సిఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎఎస్‌ఐ నూకరాజు దర్యాప్తు చేస్తారని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-సబ్బవరం : బిక్కెట్ల లోడుతో వెళ్తున్న లారీ ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని అసకపల్లి పంచాయతీ శివారు ఎరుకునాయుడుపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గండ్రేడ్డి నూకరాజు (36) దుర్మరణం చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... లారీ డ్రైవర్ నూకరాజు సబ్బవరం నుండి బిస్కెట్ల లోడుతో శ్రీకాకుళం వెళ్తూ శుక్రవారం ఉదయం విజయనగరం జిల్లా భోగాపురం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అసకపల్లికి చెందిన లారీ క్లినర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలై విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నూకరాజుకు భార్య ధనలక్ష్మి, కుమార్తెలు హైందవి, వర్షితలు ఉన్నారు. నూకరాజు మృతితో ఎరుకునాయుడుపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబాన్ని అసకపల్లి సర్పంచ్ కర్రి నర్సింగరావు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నిందితునికి ఎనిమిది రోజుల జైలుశిక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఎనిమిది మంది నిందితుల్లో ఒకరికి ఎనిమిది రోజుల జైలుశిక్ష విధిస్తూ జిల్లా మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పుచెప్పారని ట్రాఫిక్ ఎస్‌ఐ వాణిశ్రీ తెలిపారు. మిగిలిన ఏడుగురిలో ఒక్కొక్కరికీ రూ.2వేలు నుంచి రూ.8వేలు వరకు జరిమానా విధించారని తెలిపారు.

తొమ్మిది మందికి రూ.90వేలు జరిమానా

ఆనందపురం : ఆనందపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన 9 మందిని భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున 9 మందికి రూ.90వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సౌజన్య తీర్పు చెప్పారని ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు తెలిపారు

బాలికా విద్యపై అవగాహనకు కళాజాతా

ప్రజాశక్తి-ఆనందపురం: ఆడపిల్లలను రక్షించండి, చదివించండని వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేములవలస వెంకటేశ్వర పాఠశాల విద్యార్థులకు బేటి బచావో, బేటి పడావోపై అవగాహనకు కళాజాత నిర్వహించారు.సర్పంచ్ లంక కొండమ్మ, సూపర్‌వైజర్ పివి..రత్నం,పాఠశాల డైరెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

ఎపిలో రోబోటిక్స్ పరిశోధనా కేంద్రం

ప్రజాశక్తి- విశాఖపట్నం : రోబోటిక్స్‌లో పరిశోధనలకు, యువతలో నైపుణ్యాలను పెంచడానికి ఆంధ్రప్రదేశ్‌లో రోబోటిక్స్‌పై పరిశోధన కేంద్రాన్ని, ప్రత్యేకంగా రోబోటిక్స్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆలిండియా రోబోటిక్స్ అసోసియేషన్ (ఐరా) ఛైర్మన్ కిషన్ వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'రోబోటిక్ రంగం -భవిష్యత్తు' కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశంలో రోబోటిక్స్ విజ్ఞానాన్ని, నైపుణ్యం గల మానవ వనరులను పెంచడానికి ఐరా కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా రోబోటిక్స్ ప్రయోగశాలల నిర్మాణం, కోర్సుల రూపకల్పన, పరిశోధన సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో కలిసి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని వెల్లడించారు. పారిశ్రామిక రంగంతో పాటు వైద్య ఆరోగ్యరంగం, వ్యవసాయ రంగాలలో రోబోటిక్స్ ఉపకరణాల అవసరం పెరుగుతోందన్నారు. యువత రోబోటిక్స్‌లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలపై రోబోటిక్స్ ద్వారా సమాధానం చూపవచ్చునని ఆయన పేర్కొన్నారు. యువతరం నూతన ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచనలతో రోబోటిక్స్‌లో భారతదేశం అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనయర్ ప్రొఫెసర్‌లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చైతన్యనగర్‌లో సమస్యల తిష్ట!

● కనీస సౌకర్యాలు లేక జనం కటకట
● ఏళ్లు గడుస్తున్నా పట్టని అధికారులు
● ఏ వార్డు పరిధిలోకి వస్తుందో తెలియదంటూ కొత్త సమస్య లేవనెత్తిన జివిఎంసి యంత్రాంగం

ప్రజాశక్తి - వేపగుంట: జివిఎంసి 92వ వార్డు బంటాకాలనీ శివారునున్న చైతన్యనగర్ (సిపిఎం కాలనీ)లో సవాలక్ష సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. కాలనీ ఏర్పాటై ఏళ్లుగడుస్తున్నా నేటికీ అక్కడ కనీస సౌకర్యాలు లేవు. దీనిపై స్పందనలోనూ, ఇతరత్రా అధికారులు, నేతలకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా, వచ్చి సమస్యల తీవ్రతను చూసి, అయ్యో అంటూ నిట్టూర్చి వెళుతున్నారే తప్ప, సమస్యల పరిష్కారానికి మాత్రం చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. చివరకు ఏ వార్డు పరిధిలోకి వస్తుందో తేల్చుకోలేక, ప్రజా సమస్యలను, ఎవరికివారే తమకు పట్టనట్లు ప్రజల కష్టాలను గాలికొదిలేసి చేతులు దులుపుకున్నారు.

జివిఎంసి ఎనిమిదో జోన్ బంటాకాలనీ శివారునున్న చైతన్య నగర్‌లో 60కుటుంబాలకు చెందిన దాదాపు 200మంది నివాసముంటున్నారు.కొన్నేళ్ల క్రితమే ఇక్కడ కాలనీని ఏర్పాటు చేసుకుని నివాసముంటున్నా, నేటికీ కనీస సౌకర్యాలు లేవు. నేటికీ వీధిరోడ్లన్నీ కొండవాలులో ఉన్నట్లు రాళ్లు, రప్పలతో దర్శనమిస్తూ, కనీసం రూపమనేది లేకుండా మట్టితోనే ఉంది. ఇక ఇరువైపులా కాలువలు లేనేలేవు. ఇక తాగునీటికి కటకట తప్పడం లేదు. రోడ్లనేవే లేకపోవడంతో ఇతరత్రా అన్ని సమస్యలూ కాలనీవాసులను వెంటాడుతూనే ఉన్నాయి.అయినా తమ గోడు ఎవరికీ పట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు.


కొండమార్గాన్ని తలపించేలా ఉన్న చైతన్యనగర్ రోడ్డు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కానరాని స్పందన

తమ సమస్యలపై అనేకసార్లు కాలనీవాసులు అధికారులకు మొరపెట్టుకున్నారు. 2022అక్టోబర్‌లో స్పందనలో ఫిర్యాదు చేస్తే, అసిస్టెంట్ ఇంజినీర్, శానిటర్ సూపర్‌వైజర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌బృందంగా వచ్చి పరిశీలిస్తున్నారు. సౌకర్యాలు లేక ఇక్కడ జనాలు పడుతున్న కష్టాలపై ఆవేదన వ్యక్తంచేసి, ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అయితే ఈ ప్రాంతం 92వ వార్డు పరిధిలోకి రాదని, అందువల్ల తామేమీ చేయలేమంటూ చేతులెత్తేయడం కొసమెరుపు. అటుతర్వాత ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా చైతన్యనగర్‌వైపు కన్నెత్తిచూసేవారు లేకుండా పోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా స్పందించాలి

విశాఖ మహానగరానికి దాదాపు నడిబొడ్డున తమ కాలనీ ఉన్నప్పటికీ, మారుమూల ఏజెన్సీ ప్రజలకు కూడా తమకున్న కష్టాలు లేవని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కాలనీలో తక్షణమే సిసి రోడ్డు, ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణంతోపాటు తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని వేడుకుంటున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ కష్టాలకు మోక్షం లభిస్తుందని వీరంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో తాము 92 లేదంటే 93, ఏ వార్డు పరిధిలోకి వస్తామో స్పష్టం చేయాలని వేడుకుంటున్నారు.

పాట చిత్రీకరణలో కంచర్ల సినిమా


తొట్లకొండ బీచ్‌లో షూటింగ్ లొకేషన్‌లో కంచర్ల సినిమా యూనిట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖకు చెందిన యువహీరో కంచర్ల ఉపేంద్రబాబు నటిస్తున్న కంచర్ల సినిమా ఆఖరి పాట చిత్రీకరణ శుక్రవారం స్థానిక తొట్లకొండ బీచ్‌లో ప్రారంభమైంది. ఈ పాటకు లుక్స్ రాజశేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటతో సినిమా షూటింగ్ ముగుస్తోందని, ప్రీపొడక్షన్ పనులన్నీ పూర్తిచేసి వచ్చేనెలలో సినిమాను థియేటర్లలో విడుదల చేస్తామని చిత్రనిర్మాత కంచర్ల అచ్యుతరావు తెలిపారు. సినిమా దర్శకుడు యాద్ కుమార్, ఫోటోగ్రఫీ డైరెక్టర్ గుణశేఖర్, హీరోయిన్ ప్రణతి, అసిస్టెంట్ డైరెక్టర్ త్రినాధరావు, మేనేజర్ శేఖర్, సూర్యప్రకాష్, పుష్యమి, క్యాషియర్ నాగు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత


మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి-మధురవాడ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి ఐదోవార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. శుక్రవారం వార్డు పరిధిలోని ఆర్‌జెకెలో పర్యటించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ఇతర సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే ముందుగా దోమల నియంత్రణతోపాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటిలోపల, పరిసరాల్లో నీటినిల్వ లేకుండా చూడాలని, వారంలో ఒకరోజు, శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. దోమల కుట్టకుండా దోమతెరలు, మస్కిట్ కాయిల్స్ వాడాలని సూచించారు. ఎవరికైనా జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆరోగ్యకేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకుని, వైద్యులు, సిబ్బంది సూచనల మేరకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాస రావు, టిడిపి నేతలు నూకరాజు,ఒలేటి శ్రావణ్ పాల్గొన్నారు.

పెందుర్తి: డెంగీ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.వి.సత్యానందర్ సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా వేపగుంట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ గంట్ల కృష్ణ, ఆశాకార్యకర్త, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ములగాడ : మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా ఈనెల 13న శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ మల్కాపురం డివిజన్ డిఇఇ తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఆనందపురం: కొంర్యాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు రామవరం, జి.ఎస్.అగ్రహారం, గొరింట, యర్రవానిపాలెం ,భీమన్నదొర పాలెం, కొలవానిపాలెం, కణమాం, పప్పులవానిపాలెం, గండి గుండం, మామిడిలోవ, ఎన్‌జిఆర్. పురం, కొంర్యాం, దిబ్బమీద పాలెం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ సురేష్‌కుమార్ తెలిపారు. గృహ, పారిశ్రామిక వినియోగ దారులు సహకరించాలని కోరారు.

విశాఖ అంటే చాలా ఇష్టం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


ఆత్మీయ సమ్మేళనంలో వెంకయ్యనాయుడుకు అభినందన

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖ అంటే తనకెంతో అభిమానం, ఇష్టమని,ఇక్కడ సాగర తీరాన్ని చూస్తుంటే తనకు ఎనలేని ఆనందమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. కుటుంబంలో బంధువులు కన్నా తనకు స్నేహితులు ఎక్కువన్నారు. రుషికొండలోని ఎ1 కన్వెన్షన్ సెంటర్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ తన 75ఏళ్ల ప్రస్థానంలో 50ఏళ్లకుపైగా ప్రజాసేవలోనే ఉన్నానన్నారు.తన జీవితంలో ఎటువంటి పనినైనా బాధ్యతతో నిర్వర్తించానన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. తనకు చిన్నప్పటి నుంచీ పత్రికలు చదవడం అలవాటని, అందులోని ప్రముఖుల వ్యాసాలను చదివి, వాటిలోని మంచిని గ్రహించి, ఆ మార్గంలో నడిచేవాడినన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉదయం ఆరుగంటలకే అసెంబ్లీ సమావేశాలుండేవని, బస్సుల్లోనే రాకపోకలు సాగించేవాడినన్నారు. రాజకీయ నాయకుడంటే మాట, ప్రవర్త, నడవడిక అన్నింటిలోనూ హుందాతనంలో కార్యక్రమంలో మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పి.గణబాబు పాల్గొన్నారు

వెంకయ్యనాయుడుకు అభినందన

గోపాలపట్నం : 75 వసంతాలు పూర్తి చేసుకున్న తర్వాత విశాఖకు వచ్చిన మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు నగరంలోని రుషికొండ దరి ఎ1 గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో మిత్ర బృందం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడును కలిసిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఆయను పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ పాలకవర్గానికి అభినందన


సభ్యులను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి -కరాస/ వేపగుంట : నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో జివిఎంసి 52వ వార్డు మర్రిపాలెం ఉడా లేఅవుట్ వరసిద్ధి వినాయక ఆలయ నూతన పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వినాయక ఆలయ నూతన పాలకవర్గం ఏర్పాటైన సందర్భంగా శ్రీధర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన పాలకవర్గం సభ్యులకు శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. శ్రీధర్‌ను కలిసిన వారిలో పాలకవర్గం అధ్యక్షులు డి.సత్యనారాయణ, ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ల పంపిణీ


విద్యార్థులు బ్యాగుల పంపిణీ చేస్తున్న సోములు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత నందవరపు సోములు అన్నారు శుక్రవారం జివిఎంసి 92 వ వార్డు పద్మనాభనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులంతా విద్యతోపాటు జాతీయతాభావం పెంపొందించాలని సూచించారు. బడిఈడు పిల్లలందరూ పాఠశాలలకు వచ్చేలా వారి తల్లిదండ్రులు తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతోపాటు ఎన్నో ప్రయోజనాలను అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం. ఉమారాణి పద్మనాభనగర్ మాజీ గౌరవ అధ్యక్షులు కట్ట పెంటయ్య, ఉపాధ్యాయులు శోభారాణి, పేరి నాయుడు, జగదీష్ తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అపోలో వైద్యుడికి అరుదైన గౌరవం


డాక్టర్ అబ్దుల్ డి ఖాన్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈ ఏడాది సెప్టెంబరులో బెల్ గ్రేడ్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ అండ్ ట్రామాలజీ(ఎస్ఐసిఓటి) వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రొఫెసర్, హెచ్ఒడి డాక్టర్ డి ఖాన్ సమర్పించిన నాలుగు శాస్త్రీయ పరిశోధన కథనాలు ఆమోదించబడ్డాయి. ఎస్ఐసిఓటి వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రెజెంటేషన్ కోసం నాలుగు శాస్త్రీయ కథనాలను ఆమోదించడం అపోలో ఆస్పిటల్ డాక్టర్‌కు లభించిన అరుదైన గౌరవం. ఈ మేరకు ఆయనకు ఎస్ఐసిఓటి కాగ్రెస్ సైంటిఫిక్ కమిటీ డాక్టర్ ఖాన్‌కు లేఖ పంపించింది. డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ చేసిన అరుదైన, వినూత్న శస్త్రచికిత్సలకు సంబంధించిన శాస్త్రీయ కథనాలు వీటిలో ఉన్నాయి. వాటిలో పెరోనియల్ టెండోస్కోపి, చీలమండ, మోచేయి ఆర్థోపి శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగుల సమాచారం ఉంది. రాష్ట్రంలో మొదటిసారిగా ఒక వైద్యునికి ఇటువంటి గౌరవం దక్కడం, అదీ తమ ఆసుపత్రికి చెందిన డాక్టర్ డి ఖాన్‌కు రావడంతో అపోలో యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తంచేసి, డాక్టర్ ఖాన్‌ను అభినందించారు.

గోశాల ఆవరణలో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి - సింహాచలం : వన మహోత్సవంలో భాగంగా సింహాచలం గోశాలలో ఆలయ ఇఒ ఎస్.శ్రీనివాసమూర్తి శుక్రవారం మొక్కలు నాటారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు, సహాయ కార్య నిర్వహణాధికారి ఆనంద్‌కుమార్, రాజేంద్ర కుమార్, నరసింహరాజు, ఎఇఇ హరిరాజు, పర్యవేక్షణ అధికారులు నాయుడు, గాయత్రి, సిబ్బంది గోశాలలో స్వామికి ఇష్టమైన సంపంగి మొక్కలను నాటారు.


సంపంగి మొక్కలను నాటుతున్న ఇఒ

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీల ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థుల సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యాన శుక్రవారం నెహ్రూ చౌక్ జంక్షన్లో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించి, అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకర్రావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, సిపిఐఎంఎల్ నాయకులు పీఎస్ అజయ్ కుమార్, లిబరేషన్ పార్టీ నాయకులు సవరాల గణేష్ మాట్లాడుతూ జిల్లా ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థి వసతి గృహాలకు ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదని తెలిపారు. ఇది విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారిందని, నిధులు లేని కారణంగా వసతి గృహాల్లో విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందటం లేదని పేర్కొన్నారు. హాస్టళ్లలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొన్ని వసతి గృహాలలో సిబ్బంది కొరత వున్నదని, ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా లేక విద్యార్థులు మరుగుదొడ్లకు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లకు నోడల్ అధికారులను పంపి సమగ్రమైన ఆడిట్ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై ఎన్ భద్రం, విద్యార్థి నాయకుడు జి. ఫణీంద్ర, సిపిఎం పార్టీ నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, మామిడి రమణ పాల్గొన్నారు.



ఆర్‌డిఒ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు


వైఎస్.జగన్‌తో గండి రవికుమార్ తదితరులు

వైఎస్.జగన్‌ను కలిసిన రవికుమార్

ప్రజాశక్తి- సబ్బవరం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని మొగలిపురం మాజీ ఎంపీటీసీ, వైసీపీ నాయకుడు గండి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా జగన్ రవికుమార్‌కు సూచించారు. జగన్మోహన్ రెడ్డిని కలిసిన వారిలో వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షుడు ఎడ్ల నాయుడు, మొగలిపురం ఉపసర్పంచ్ సిరపరపు వాసు, గురి శ్రీనివాస్, కరక రాము, కర్రి వినోద్, గురి రవికుమార్ ఉన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని వీధుల్లో శుక్రవారం పంచాయతీ పారి శుధ్య సిబ్బంది దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. కొద్దిరోజులుగా వర్షాలు దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ సుంకర లక్ష్మి తెలిపారు. పలు పేరుకుపోయిన గడ్డి నివారణ మందును పిచికారి చేస్తున్నట్లు చెప్పారు.

యానాద్రి కాలువకు రూ.7.78 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలిలో అతి ప్రధాన సమస్యల్లో ముఖ్యమైన యానాద్రి కాలువ మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూ.7.78 కోట్లు కేటాయించడం పట్ల చైర్ పర్సన్ రమాకుమారి శుక్రవారం సంతోషం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికార్లు, కౌన్సిలర్ల సమక్షంలో ఆమె యానాద్రి కాలువను సందర్శించి చికకాల సమస్య తీరనుందని అందుకు తోడ్పడ్డ అధికార్లను అభినందించారు. ఇప్పటికే కాలువలో కొంత మేర షిల్టు తీయడం జరిగిందని, యానాద్రి కాలువ పూర్తి స్థాయిలో ప్రక్షాళన జరుగుతుందన్నారు. కాలువను సందర్శించిన వారిలో కమిషనర్ ప్రభాకరరావు, డిఇఇ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, టిపిఒ శ్రీలక్ష్మి, వైస్ చైర్మన్లు బెజవాడ వెంకట గోవిందరాజు నాగేశ్వరరావు, ఆరేపు నాగ త్రినాథ ఈశ్వరగుప్తా, పిళ్లా కనకమణి, దాసరి చిన్నమ్మలు, దూది నరసింహమూర్తి, దాసరి కుమార్, పిళ్లా త్రినాథ్ ఉన్నారు.

తాగునీటి పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన

దేవరాపల్లి : దేవరాపల్లిలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులను, కుమ్మరి వీధిలో జరుగుతున్న వాటర్, శానిటేషన్ పనులను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, మిడతాడ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-అనకాపల్లి : మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాను అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా కలెక్టర్ చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. .

పరిశ్రమల్లో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలు

కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఉన్న పరిశ్రమలలో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నూతన జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని, వాటి నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందించటం జరుగుతుందని చెప్పారు. అచ్యుతాపురం పరిశ్రమల సంఘం సభ్యులు జిల్లా కలెక్టరుకు విన్నవించిన సమస్యలపై చర్చించారు. ముందుగా అచ్యుతాపురం నుండి పరవాడ రోడ్డు మరమ్మతుల పనులు, పరిశ్రమలలో పనిచేసే వారికి బస్సు సౌకర్యం, పరిశ్రమలకు హెచ్‌టి పవర్ సప్లై, నీటి చార్జీలు, లోడింగ్/ అన్‌లోడింగ్ హమాలి సమస్యలు, ట్రక్ పార్కింగ్, డ్రైనేజ్ సమస్యలపై అధికారులు తీసుకుంటున్న చర్యలు గురించి జిల్లా కలెక్టర్ చర్చించారు. తదుపరి సమావేశం నాటికి సమస్యలు పరిష్కించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఏ.పీ.ఐ.ఐ.సీ. జోనల్ మేనేజర్ హరి ప్రసాద్, భూగర్భ గనుల శాఖ, కార్మిక శాఖ, వివిధ పరిశ్రమల కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి -అనకాపల్లి : సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని, వృత్తి నైపుణ్యత పెరిగినప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. శ్రీగౌరీ గ్రంథాలయంలో జన శిక్షణ సంస్థాన్ సహకారంతో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వృత్తి నైపుణ్యతలుంటేనే జీవనాన్ని ఎదుర్కొనగలమన్నారు. ఆధునిక సాంకేతికతల వల్ల ఆన్‌లైన్ వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, తద్వారా ప్రయోజనాలను అందిపుచ్చుకోవడం ఎంత అవసరమో, మోసాలకు చిక్కకుండా జాగ్రత్తపడటమూ అంతే కీలకమని పేర్కొన్నారు. దీనికి కంప్యూటర్ అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.ఎ.రామరాజు మాట్లాడుతూ శిక్షణ కాలంలో స్టేషనరీ, మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెఎస్ఎస్ డైరెక్టర్ కె.నాయుడు, గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు డి.నూకఅప్పారావు, కాండ్రేగుల వెంకటరమణ, ప్రతినిధులు భీశెట్టి కృష్ణఅప్పారావు, మళ్ల బాపునాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు. అనంతరం గతంలో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్‌లో పొందిన అభ్యర్థులకు సర్టిఫికేట్లను కొణతాల రామకృష్ణ అందజేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

రెండో శనివారం సెలవు అమలుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రతి నెలా రెండో శనివారం సెలవును అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి అమలు జరిగేలా అనకాపల్లి జిల్లా ఆర్‌ఐఒ, విద్యాశాఖాధికారులు దృష్టి నిలిపి చర్యలు చేపట్టాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సెలవు అమలులో ఏ యాజమాన్యానికి ఎటువంటి మినహాయింపులు ఉండబోవని, పక్కగా అమలు జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక పరిశీలన బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నేరుగా ఫిర్యాదులను apscpcr2018@gmail.com పంపవచ్చని సీతారాం తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 8 వినతులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు ఎస్పీ కెవి.మురళీకృష్ణ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 8 మంది పోలీసు సిబ్బంది వినతిపత్రాలు అందజేశారు. వారి అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించారు. ఎస్పీ వారి విన్నపములను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని చూచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్ ఎస్తేర్ రాణి ఆధ్వర్యాన మండలంలోని మేలుపాక గ్రామంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని, దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అయినంపూడి విజయభాస్కర్‌రాజు, ఆరోగ్య విస్తరణ అధికారి గుర్రం శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది జి.లక్ష్మణ, యమునా లక్ష్మి, శారద, గంగాభవాని, సరగడం అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బొకేలొద్దు.. విరాళాలు ఇవ్వండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యేగా తనను కలవడానికి వచ్చిన ఏ ఒక్కరూ పుష్పగుచ్ఛాలు, సాలువాలు తీసుకురావద్దని, దానికి బదులు ఇచ్ఛా ఫౌండేషన్‌కు విరాళాలు ఇవ్వాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రజలకు, అధికారులకు, కార్యకర్తలకు సూచించారు. బొకేలు, సాలువాలు కొనుగోలు చేయడం ద్వారా డబ్బులు వృధా చేయొద్దన్నారు. తన కార్యాలయంలో ఇచ్ఛా ఫౌండేషన్ అనాథ ఆశ్రమానికి చెందిన హుండీ ఏర్పాటు చేస్తున్నామని, అనాథలైన వికలాంగుల మంచి చెడ్డలు చూస్తున్న ఇచ్ఛా ఫౌండేషన్ సంస్థకు హుండీలో విరాళం వేయడం ద్వారా అనాథలైన వారికి ఆర్థికంగా చేయూత ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పేట బయ్యవరం పాఠశాలలో హెడ్‌మాస్టర్ సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన విద్యార్థుల తల్లి దండ్రుల సమావేశంలో 92 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గెంజి శ్రీనివాసరావు, యడ్ల చిన్నబాబు, మాజీ పాలసొసైటీ అధ్యక్షులు బాబూరావు, యడ్ల నానాజీ, యడ్ల కాంతారావు, బద్దిరెడ్డి శ్రీనివాసరావు, అడపా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నూకేశ్ తదితరులు పాల్గొన్నారు .

బుచ్చయ్యపేట : మండలంలోని మల్లం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఏకరూప దుస్తులను మాజీ సర్పంచ్ గోలగాన రాజారావు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎ.అప్పలరాజు, సత్యనారాయణ, హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టి, పెండింగ్ క్లెయిమ్స్ నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యాన శుక్రవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోన లక్ష్మణ మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో 46 వేల క్లెయిమ్స్ నిధులను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. దారిమళ్లించిన నిధులను రికవరీ చేసి బోర్డు అకౌంట్‌లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆలం శంకర్, నగిరి రామారావు, బండారు వెంకటేష్, మొల్లేటి ఈశ్వరరావు, తోట సత్తిబాబు, పెద్దిశెట్టి దుర్గ, వెదురుపర్తి మాణిక్యలరావు పాల్గొన్నారు

పొట్టిదొరపాలెంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -వడ్డాది : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పంచాయతీ కార్యదర్శి ఏ నాగేశ్వరరావు అన్నారు. బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెంలో శుక్రవారం శానిటేషన్ పనులు చేపట్టారు. మురికి కాలువలు, ఎక్కువ నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో శానిటేషన్ చేయించారు. వీధులను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



సంత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లారస్ ప్రతినిధులు

వారపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్చలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేట వారపు సంతలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం లారస్ కంపెనీ ప్రతినిధులతో ఆయన చర్చలు జరిపారు. కంపెనీ సిఎస్ఆర్ నిధులతో లోతట్టు ప్రాంతంగా ఉన్న సంత స్థలాన్ని ఎత్తు చేయాలని నిర్ణయించారు. స్థలంలో పక్కాగా భవనాలు నిర్మించి వ్యాపారులు, రైతులకు అనుకూలంగా ఉండేలా షెడ్లు నిర్మించడానికి లారస్ కంపెనీ ప్రతినిధులు ముందుకొచ్చారు. ప్రతిపాదిత సంత స్థల సరిహద్దులను గుర్తించాలని కోరారు. షాపులు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయం వంటి వాటిని సమకూర్చటానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. సంతను అభివృద్ధిపై వ్యాపారులు, రైతులు, కొనుగోలుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని వారాడ విద్యుత్ సబ్ స్టేషన్లో నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల వారాడ, పిండ్రంగి, రామయోగిఅగ్రహారం, ఆనందపురం, వి.సంతపాలెం, యడ్లవానిపాలెం, కొరువాడ, గవరపాలెం, కెజె.పురం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, దీనిని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్స్ పనులు, మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం 8 నుండి 12 గంటల విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట ఈఈ రామకృష్ణ తెలిపారు. దీని వల్ల తీడ, చరకం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, రాజుపేట, శెట్టిపాలెం, దుంగవానిపాలెం, భీమబోయినపాలెం, రామన్నపాలెం, కొత్తపాలెం, జెడ్.గంగవరం గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరపల్లి : దేవరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీనికి ఆ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

పశుగ్రాసంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మేలైన పశు సంపద ఉత్పత్తికి పోషక విలువలతో కూడిన పశుగ్రాసంతోనే సాధ్యమని చోడవరం పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని దిబ్బిడి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక పాల దిగుబడుల కోసం రైతులు పశు దానాల పై ఆధారపడుతున్నారని, దీని వల్ల అధికంగా నష్టం వస్తుందని చెప్పారు. పశు దాన వినియోగం తగ్గించి అలుసంద, పిల్లిపెసర, కాకిజొన్న వంటి గడ్డిని వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఉమామహేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు మణికంఠ, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

గెడ్డవాగులో ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయతీ శివారు బలిజ పాలెంలో సర్వే నంబర్ 162 ప్రభుత్వ గెడ్డవాగులో జనసేన పార్టీకి చెందిన కొంతమంది ఆక్రమణలు చేశారని నారపాడు ఎంపిటిసి భర్త మామిడి కొండాజీ, దుర్గారావు స్థానిక ఆర్ఐ వీరయ్యకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నారపాడు సర్వే నంబర్ 162 ప్రభుత్వ గెడ్డవాగులో తాసుబిల్లి వారి కల్లాలకు రాకపోకలకు, చేనులకు వెళ్ళుటకు గాను రహదారి నిర్మించుకున్నారని, అయితే ఆ గెడ్డ వాగుకు చెందిన స్థలాన్ని జనసేనకు చెందిన కొంతమంది జెసిబితో చదును చేసి ఆక్రమణ చేశారని, ఈ ఆక్రమణ వెంటనే తొలగించాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

12 నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలి

- ఎన్టిఆర్ ఆసుపత్రి వద్ద మత్తు విముక్తి కేంద్ర సిబ్బంది రిలే నిరాహార దీక్షల ప్రారంభం
- ఎపి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మద్దతు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న మత్తు విముక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి 2023 ఆగస్టు నుండి 12 నెలలుగా చెల్లించాల్సిన జీతాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆ సిబ్బంది అనకాపల్లి ఎన్టిఆర్ వైద్యాలయం వద్ద శుక్రవారం నుండి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. వీరి దీక్షా శిబిరాన్ని ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వైద్య రంగానికి బడ్జెట్ కుదిస్తుందన్నారు. మత్తు విముక్తి కేంద్రాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి కనీసం ప్రతి నెలా జీతాలు కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలోని 25 కేంద్రాల్లోని పనిచేస్తున్న సిబ్బందికి 12 నెలలుగా జీతాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ఈ సిబ్బందికి 12 నెల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంలో తమ యూనియన్లు భాగస్వాములు అవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణచంద్ర, కౌన్సిలర్లు క్రాంతి కుమార్, బి నాయుడు బాబు, ఎ మణి, డీఈవో జీ కీర్తన, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి, శ్రీదేవి, వార్డు బాయిలు వై.చంద్రశేఖర్, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మత్తు విముక్తి కేంద్రం సిబ్బంది

ఎవరి అనుమతితో చెట్లు నరికేస్తున్నారు?

కౌన్సిల్ సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులపై చైర్‌పర్సన్ రమాకుమారి ఆగ్రహం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ప్రజాశక్తి - యలమంచిలి

అత్యంత ప్రాధాన్యత కలిగిన చెట్ల పెంపకం కార్యక్రమంలో మున్సిపాలిటీలో నాటిన మొక్కలను విద్యుత్ శాఖ అధికారులు నరికేయడంపై మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి అనుమతితో పెరిగిన చెట్లను నరికేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. శుక్రవారం జరిగిన మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇక ముందు తమకు ముందస్తు సమాచారం లేకుండా చెట్లపై చెయ్యివేస్తే కేసులు పెట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఏప్రిల్ - జూన్ నిధుల వివరాలు అందిస్తూ జూన్ చివరి నాటికి రూ. 1 కోటీ 34 లక్షలు ప్రారంభ నిల్వ ఉండగా జూన్ చివరి నాటికి ముగింపు నిల్వ రూ.1.34 కోట్లుగా చూపించారు. ఈ కాలంలో రూ.25.41 లక్షల ఆదాయం సమకూరగా, ఖర్చులు రూ.25.63 లక్షలుగా పేర్కొన్నారు. ఇప్పటికే ఇళ్లకు నీటి కొళాయి కనెక్షన్ ఉన్నవారు రూ.5075 చెల్లించి రేటిపై చేసుకోవాలని కౌన్సిల్ తీర్మానించింది. గతంలో బర్త్ , డెత్ సర్టిఫికెట్లు పొందడానికి మూడు నెలలు, ఆ తర్వాత 30 రోజులుగా ఉండేదని అది 21 రోజులకు కుదించారని, దీన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వైస్ చైర్మన్ గుప్తా మాట్లాడుతూ శ్మశాన వాటికలోనే రిజిస్టర్ ఓపెన్ చేసి అక్కడే సర్టిఫికెట్ జారీ విధానం ప్రవేశపెట్టాలని కోరారు. అందుకు కౌన్సిల్ ఆమోదించింది. అన్న క్యాంటిన్ భవనంలో నిర్వహిస్తున్న 4, 5 వార్డుల సచివాలయాలను మున్సిపల్ కార్యాలయానికి తరలించామని, వాటి స్థానే కొత్త కార్యాలయాలు నిర్మాణానికి ఒక్కో సచివాలయానికి రూ.8.75 లక్షలు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రభాకరరావు, డిఇఇ వీరయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా తదితరులు మాట్లాడారు.

వెల్‌నెస్ సెంటర్‌లో టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని అమృతపురం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం శుక్రవారం సందర్శించి పరిశీలించింది. జిల్లా ప్రోగ్రాం మేనేజ్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ లూసీ ఆధ్వర్యాన టీం సభ్యులు సెంటర్ పరిధిలో అమలవుతున్న వివిధ ఆరోగ్య పథకాల గురించి ఆరా తీశారు. మాతా శిశు ఆరోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పి కుమారి వైవి తులసి, ఏఎన్ఎం పి.పరమేశ్వరి, ఆశాలు కర్రి అరుణ, గండి దేవి రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది ప్రజలకు అందించే సేవలలో లోపాలను, రికార్డుల నిర్వహణలో లోపాలను, డేటా ఆన్లైన్ చేయడంలో లోపాలను గుర్తించి తగు సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో సేవలను అందించడంలో ఉన్న లోపాలను గుర్తించి జిల్లా అధికారులకు, ప్రభుత్వానికి తగు నివేదికలు సమర్పిస్తామని డిపిఎంఓ డాక్టర్ లూసీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్ ఫోర్స్ టీం తరుపున వైద్య ఆరోగ్య శాఖ జిల్లా గణాంక అధికారి ఎ.రామచంద్రరావు, ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కె.జగదీష్ నానాజీ, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ డి. నాగమణి, జిల్లా డేటా మేనేజర్ వై.జనార్ధన్, గుల్లేపల్లి పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి టి.శంకరరావు, వైద్య సిబ్బంది పి.కళావతి, జి.సత్యవతి, ఎస్.భారతి, జి.తలుపులమ్మ లోవ, పేరపు దేవి, బి.ఉమామహేశ్వరి, ఎస్.జయలక్ష్మి, ఎం.రాజేశ్వరి, జి.మహాలక్ష్మి, వెంకటేష్, ఆశాలు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన బాలికలకు అధికారుల పరామర్శ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జెడ్పీ హైస్కూల్లో గురువారం అస్వస్థతకు గురైన బాలికలను జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, డిస్ట్రిక్ట్ ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ యాదవ్ శుక్రవారం పరామర్శించారు. వడ్డాది జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వాసుపత్రులను సందర్శించారు. హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం, పారిశుధ్య పరిసరాలను, తరగతి గదులను, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్లను పరిశీలించారు. మరుగుదొడ్ల వద్ద పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కూడా ఓ విద్యార్థిని అస్వస్థతకు గురి కాగా ఆమెను పిహెచ్‌సికి తరలించి చికిత్స అందించారు. అనంతరం సచివాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ శ్రీజ హైస్కూల్లో ఫుడ్ శాంపిల్స్‌ను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాశి విశ్వేశ్వరరావు, హెచ్‌ఎం పివి శేసుబాబు, పిహెచ్‌సి డాక్టర్ శకుంతల, వైద్య సిబ్బంది నారాయణమూర్తి పాల్గొన్నారు.

వరి ఎద పద్ధతిపై రైతుల మొగ్గు

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, కూలీల కొరత వలన రైతులు వరి ఎద (నేరుగా విత్తే) పద్ధతిపై మొగ్గు చూపుతున్నారని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు తెలిపారు. దీనివలన కూలీ ఖర్చు తగ్గడమే కాక నారుమడి పెంచే సమయం కలిసి వచ్చి 20 నుంచి 25 రోజులు ముందు పంట కోతకు వస్తుందన్నారు. ఈ పద్ధతిలో సాగు చేయడం వలన కలుపు సమస్య తలెత్తుతుందని, నివారణకు సరైన సమయంలో సరైన మోతాదులో మందులు వేసుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చని పేర్కొన్నారు.

కలుపు యాజమాన్య పద్ధతులు

వరి విత్తిన వెంటనే ప్రేటి లక్లోర్ కలుపు మందు ఎకరాకి 600 మిల్లీలీటర్లు లేదా పెండి మిథాలిన్ 700 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తిన 20 రోజుల్లో గడ్డి, వెడల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు బిస్పైర్బాక్ సోడియం ఎకరాకు 100 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి బాగా తడిసేలా పిచికారి చేయాలి. గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఫెనోక్సా ప్రోప్ పి ఎథైల్‌ను 350 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. 30 రోజులు వయసుగల వరి పంటకు వర్షాల వల్ల కలుపు సమస్య వస్తే 2,4 అమైన్ సాల్ట్ రెండు మిల్లీలీటర్లు, 10 గ్రాముల యూరియాను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. లేదా ఆల్మిక్ కలుపు మందును ఎకరాకు 8 గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకుంటే కలుపు సమస్య తగ్గుతుందని పేర్కొన్నారు.

కౌలుదారుల గుర్తింపు కార్డులపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కౌలు రైతుల గుర్తింపు కార్డులపై శుక్రవారం మండలంలోని విఆర్ఒలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వీఆర్వో లాగిన్‌లో కౌలు కార్డు (సిసిఆర్‌సి) పొందడానికి అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులు ఒక సెంటు సొంత భూమి లేకుండా ఉండి వేరే వారి భూమిలో పంటలు సాగు చేసే వారు ఈ కార్డులకు అర్హులని పేర్కొన్నారు. అటువంటి వారి భూమి యజమాని పాస్ పుస్తకం, భూమి యజమాని ఆధార్ కార్డుల జెరాక్స్‌లు, కౌలుదారుని ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ ఎకౌంట్ జెరాక్స్, పది రూపాయలు రెవెన్యూ బాండ్ పేపర్ మీద 11 నెలలకు ఒప్పందం రాసుకొని పంచాయతీ వీఆర్వో డాక్యుమెంట్స్ అన్నీ ఇస్తే కౌలు కార్డు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. దీనిపై రైతులకు స్పష్టంగా అవగాహన కల్పించాలని సూచించారు.

వాకపల్లి సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి సచివాలయంలో ఇంచార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయం సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించి విధులకు సక్రమంగా హాజరు కావాలని ఆదేశించారు. సచివాలయ రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు చేయాలని పంచాయతీ సెక్రెటరీ బి.సత్యనారాయణకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఈఓపిఆర్డి జి. సంతోష్ నళిని, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

-ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి -చీడికాడ:అధికారులు రాజకీయ నాయకుల సమన్వయం, సహకారంతో కలిసి పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేస్తామని మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా మండల అధికార నాయకులు ఎమ్మెల్యే బండారును ఘనంగా సత్కరించారు. అనంతరం మండలంలో పలు గ్రామాలలో సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. మంచాల, కోనాం, సిరిజాం, వీరభద్ర పేట, గ్రామాలలో విద్యుత్ సమస్య తరచుగా వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి పలువురు సభ్యులు తీసుకురాగా సమస్య వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో అడవి పందులు పొలంలోకి రాకుండా ఉండేందుకు కరెంటు స్తంభాల నుండి విద్యుత్ వాడటంతో ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ అవుతుందని, దీంతో, కరెంటు సమస్య తరచుగా ఏర్పడుతున్నాయని ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో 2014-19లో నిర్మించిన డంపింగ్ యార్డ్‌లకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని జి.కొత్తపల్లి సర్పంచ్ సూరి నాయుడు తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోని అడగ్గా తీయగా అప్పటి ఏపిఓ, టెక్నికల్ అసిస్టెంట్లు ఎమ్ బుక్కులు తయారు చేయలేదని, అందుకే బిల్లులు రాలేదని వివరణ ఇచ్చారు. మండలంలోని శ్మశానాలకు షెడ్ల నిర్మించుటకు ప్రణాళికలు తయారు చేయాలని ఎపిఓ నాగరాజుని ఆదేశించారు.పిఎం కిసాన్ నగదు అందని వారిని గుర్తించి కేవైసీ సంబంధిత సమస్యలు ఉంటే సత్వరం పరిష్కరించాలన్నారు.జలజీవన్ మిషన్ పనులు నాణ్యతగా చేసి ప్రతి ఇంటికి తాగునీరు అందేటట్లు చూడాలని ఏఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పిటిసి శారద వరలక్ష్మి, ఎంపీడీవో ఉమామహేశ్వరి, తహసీల్దార్ ప్రకాష్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.



చిన్నారికి చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ అనూష

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి లో భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్ట్ సిహెచ్ అనూష ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. గత కొద్దికాలం నుండి ఫిజియోథెరపిస్ట్ లేకపోవడంతో భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు నిలిచిపోయాయి. ఫిజియోథెరపిస్ట్‌గా సిహెచ్ అనూషను నియమించడంతో శుక్రవారం ఆమె ఫిజియోథెరపీ సేవలను ప్రారంభించారు.మానసిక, శారీరక, బహుళ వైకల్యం కలిగిన చిన్నారులకు సేవలు అందించారు. వారానికి ఒక్కరోజు ప్రతి బుధవారం నక్కపల్లి భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేయనున్నట్లు వెల్లడించారు. 8 మంది చిన్నారులకు అవసరమని గుర్తించామన్నారు. మూగ, చెవిటి, అంధులు, మెడ సంబంధిత వ్యాధులు, బుద్ధిమాంద్యత, అంగవైకల్యం తదితర ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నిత్యకృత్యాలు, పలు మెళకువలు నేర్పిస్తామని ఐఈఆర్‌టిలు గౌరీ, అరుణ తెలిపారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గురుకుల కళాశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రతి విద్యార్థి పరిసరాల పరిశుభ్రత తో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని గొలుగొండ పిహెచ్సి వైద్యాధికారి శ్యాం అన్నారు. మండల కేంద్రంలో ఉన్న గురుకుల కళాశాలలో శుక్రవారం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. రక్తంలో హిమోగ్లోబిన్, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు, డయేరియా వ్యాధులపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు.వైద్యాధికారి కీర్తితో కలిసి ఆయన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సిహెచ్ఓ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై విచారణ చేపట్టాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఎన్.నరసాపురం పంచాయతీ నిధుల వినియోగంపై విచారణ జరిపించాలని పంచాయతీ ఉప సర్పంచ్ భర్త ఎం గంగరాజు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పాలక వర్గమునకు తెలియకుండా సర్పంచ్ నిధులు వినియోగించారని, .ఏ ఏ అభివృద్ధి పనులకు, ఎంత చొప్పున నిధులు ఖర్చు చేశారో పాలకవర్గానికి తెలియజేయలేదని, వెంటనే విచారణ చేపట్టి తెలియజేయాలని కోరారు. పంచాయతీలో పాలకవర్గం సభ్యులు ఆమోదం లేకుండా తీర్మానం చేసినందుకు గాను పంచాయతీ కార్యదర్శి పై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గట్టెం గణేష్, వంగలపూడి శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.



పొదల్లో ఉన్న కొండచిలువ

కొండ చిలువ హల్‌చల్


ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలో లుంగపర్తి పంచాయతీ వెలగలపాడులో కొండచిలువ హల్ చల్ చేసింది, గ్రామనికి చెందిన బద్నయిన సీతమ్మ కు చెందిన మేక గురువారం మేత కోసం గ్రామానికి సమీపాన అటవీ పొదలలోకి వెళ్లింది. మేకను కొండ చిలువ మింగేసింది. సాయంత్రానికి మేక జాడ కానరాక పోవడంతో పెంపకం దారులు గాలించారు. పొదల్లో ఉన్న కొండచిలువ మేకను మింగేసి నట్లు గుర్తించారు. కొండచిలువ సంచారంతో పలువురు పలువురు పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి -గొలుగొండ:విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న భోజన మెనూని సక్రమంగా అమలు చేస్తూ, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎంపీడీవో రత్న కుమారి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక గురుకుల కళాశాలలో ఆమె సందర్శించారు. కళాశాలలోని విద్యార్థులకు కేటాయించిన వసతి భవనాన్ని, తరగతి గదులను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని ఆమె పరిశీలించారు. భోజనం విషయంలో ఎక్కడా నాణ్యతకు రాజీ లేకుండా విద్యార్థులకు అందించాలని ఆమె ప్రిన్సిపాల్ రామకృష్ణకు సూచించారు. కళాశాలలో వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాదంపాలెం పంచాయతీ కార్యదర్శి రఘు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో ఉన్న ఏకలవ్య స్కూల్‌లలో 4వేలకు పైగా విద్యార్థిని, విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని, విద్యాబోధన కోసం స్థానిక ఉపాధ్యాయుల్ని నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ జీవన్ కృష్ణ శుక్రవారం ఐటిడిఏ లో ప్రాజెక్ట్ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులని నియమించారన్నారు. వీరి బోధన ఇంగ్లీష్, హిందీ బాషలో ఉండటంతో విద్యార్థులకు అర్థం కావడంలేదన్నారు. స్థానిక ఉపాధ్యాయులను నియమిస్తే విద్యార్థులకు అర్థం చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. కొయ్యూరు, పాడేరు, అరకు, హుకుంపేటలో సొంత పాఠశాల భవనాలు నిర్మాణ పనులు వేగం చేయాలన్నారు. యూనిఫామ్స్, బుక్స్ పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని కోరారు. అన్ని పాఠశాలల్లో తాగునీరు, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలన్నారు.మెనూ సక్రమంగా అమలు చేయాలని వినవించారు..

'శిక్షలు లేని చట్టాలు ఎందుకు'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నూతన క్రిమినల్ కఠిన చట్టాలు ఎన్ని వచ్చినా శిక్షలకు నోచుకోని చట్టాలు ఎందుకని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ,చట్టాలను చట్టాలుగా మారుస్తున్న అధికారుల తీరుపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అట్రాసిటీ కేసులను కఠినంగా అమలు చేయడంలో పోలీసు విఫలమవుతున్నారని ఆరోపించారు. కేసుల్లో బాధితులను విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా చట్టాలను సక్రమంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా శ్రీనివాసరావు, పొట్నూర్ గోవింద్, మామిడి అర్జున్, రాము రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాపారావు



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపాధి కూలీలకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్ డిమాండ్ చేసారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. 9 వారాలుగా ఉపాధి కూలీలకు కూలి చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .కూలీలకు సకాలంలో పేమెంట్లు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఉపాధి కూలీల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే బకాయిలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పేమెంట్లు చెల్లించే విధంగా కృషి చేస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో గొర్ల రమణ, మనబాల శ్రీను, ఎలమంచిలి దుర్గాప్రసాద్, ఒమ్మి శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

రూ.10 లక్షల విరాళంపై అయ్యన్న ఆరా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం నూకాంబిక ఆలయానికి సిఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ విరాళంగా ఇచ్చిన పది లక్ష రూపాయలు దేనికి ఖర్చు చేశారని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దేవాదాయశాఖ అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం దేవాదాయశాఖ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న వేసిన ప్రశ్నకు విరాళం డబ్బులు ఎండోమెంట్ వారికి చేరలేదని డిఈ కేవి.కృష్ణ చెప్పారు. దేవాదాయ శాఖకు తెలియకుండా పది లక్షల రూపాయలు ఎక్కడికి వెళ్లాయని అయ్యన్న ప్రశ్నించారు. తక్షణమే అసిస్టెంట్ కమిషనర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అయ్యన్న ఆదేశించారు. నర్సీపట్నం పరిసర ప్రాంతం లో సుబ్బారాయుడుపాలెం, చమ్మచింత, జోగుణాథం పాలెం రామాలయాలు, నర్సీపట్నం నూకాంబిక ఆలయాలు ఆగస్టు లోపు పూర్తి చేసి ప్రారంభించాలని స్పీకర్ ఆదేశించారు.



శుద్ధిని చేయిస్తున్న ఎఒ సుధారాణి

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి

ప్రజాశక్తి -గొలుగొండ: రైతులంతా తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని మండల వ్యవసాయ అధికారి కె. సుధారాణి సూచించారు. మండలంలో చోద్యం రైతు సేవా కేంద్రంలో రైతులకు విత్తన శుద్ధి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విత్తన శుద్ధితో తెగుళ్లు తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. వరిలో కొత్త వంగడాలను రైతులు ఉపయోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. విత్తసుద్ధి ఎలా చేయాలో రైతులకు ఆమె ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో చోద్యం సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ జయ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటపతిరాజు

జిఒ 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రభుత్వం జీవో 115ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతి రాజు కోరారు. మండలంలోని పలు పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకునే దిశగా సంఘం పని చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధర్మారావు, జిల్లా కార్యదర్శి సత్యడ దాసు, పడాల అప్పారావు, కృష్ణ ప్రసాద్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి పలువురు విద్యార్థుల ఎంపిక



జగదీష్



హర్ష



సుభాష్

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ కే.నరేష్ తెలిపారు. పి.జగదీష్ (నూజివీడు), పార్థు హర్ష (శ్రీకాకుళం), వి.సుభాష్ (శ్రీకాకుళం) క్యాంపస్‌లకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

వీనస్ విద్యార్థిని ప్రతిభ



హమన్య

మాడుగుల : ఐఐఐటి ఫలితాలలో మాడుగుల వీనస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థిని ప్రతిబిను కనపరిచింది. వీనస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థిని తామరపల్లి హేమన్య సెలెక్ట్ అయ్యిందని శుక్రవారం కరస్పాండెంట్ తాలపురెడ్డి నాగచంద్ర తెలిపారు. హేమన్యను సర్పంచ్ ఎడ్ల కళావతి, దేవరపల్లి శ్రీనివాసు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, జెడ్పిహెచ్ బాయ్స్ హై స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.



గొలుగొండ: మండలంలో ఇద్దరు విద్యార్థినీలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఎఎల్ పురం హైస్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసిన మైచర్ల మాధవికి శ్రీకాకుళం కాలేజికి, చీడిగుమ్మల జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి చదివిన లిఖిత కావ్యకు ఒంగోలు కాలేజీకి ఎంపికైనట్టుగా ఆయా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఆనంద్ లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినిలకు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

సత్తాచాటిన విద్యార్థులు




నాగలక్ష్మి



లీలా సాహితి



నేహ



యశ్వంతి సత్య



కల్పన



అభిరామ్, కశింకోట

చోడవరం: చోడవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల చదివిన ఐదుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐవి.రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం విడుదలైన ఫలితాలలో పాఠశాలకు చెందిన ఎం.నేహ, జి.నాగలక్ష్మి నూజివీడు ట్రిపుల్ ఐటికి టి.లీలా సాహితి, వై.యశ్వంతి సత్య శ్రీకాకుళం, ఎస్.కల్పన ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఇంతటి మంచి ఫలితాలు రావడానికి కారకులైన 10వ తరగతి ఉపాధ్యాయులను హెచ్ఎం అభినందించారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం జెడ్పి హైస్కూల్లో పదో తరగతి చదవిన వైఆర్.అభిరామ్ నూజివిడు ట్రిబుల్ ఐటికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మిసుమన్ శుక్రవారం తెలిపారు. అభిరామ్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అబి నందించారు.



చంద్రహాసిని



అరవింద్

ప్రజాశక్తి -ఆనందపురం: టెన్త్ ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన మండలంలోని గిడిజాల ఉన్నత పాఠశాల విద్యార్థిని సవరవిల్లి చంద్ర హాసినితోపాటు మరో విద్యార్థి ఇ.అరవింద్‌కు ట్రిపుల్ ఐటిలో సీట్లు వచ్చాయని పాఠశాల హెచ్ఎం ఎల్ఎస్ఎన్ పాత్రో తెలిపారు. హాసినికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలోనూ అరవింద్‌కుకు ఒంగోలులోను సీటు వచ్చిందన్నారు. మంచి ప్రతిభతో ట్రిపుల్ ఐటిలో సీట్లు సంపాదించిన విద్యార్థులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. విద్యార్థులను అభినందించిన ఘట్టమనేని ఎస్టేట్ అధినేత ఘట్టమనేని సుభాష్‌చంద్రబోస్, వారి చదువులకు చెరో రూ.1.20 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తానని ప్రకటించారు. టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి కోరాడ వైకుంఠం ,గిడిజాల గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు తదితరులు విద్యార్థులను అభినందించారు

భీమునిపట్నం : మండలంలోని మజ్జివలస జెడ్పి హైస్కూల్‌కు చెందిన రౌతు ప్రమీల, అమనాం జెడ్పి హైస్కూల్‌కు చెందిన వేమాల జ్ఞానలక్ష్మి, కొయ్య జాహ్నవి ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

హెల్మెట్‌ధారణతో ప్రాణరక్షణ

సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

ప్రజాశక్తి- విశాఖపట్నం: రహదారి ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణాలు కోల్పోవడానికి అతి వేగంతో పాటు వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారమణని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి.శేషమ్మ అన్నారు. శుకవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా నిర్వహించిన రహదారి భద్రత కార్యక్రమంలో మాట్లాడుతూ,. 2019 మోటారు వెహికిల్ చట్టం ప్రకారం ప్రతి వాహన చోదుకుడు విధిగా హెల్మెట్ ధరించాలని, లేని పక్షంలో శిక్షకు గురి అవుతారని తెలిపారు. వాహన యజమాని తన వాహనాన్ని వేరొకరికి ఇచ్చిన సందర్భంలో ప్రమాదం జరిగితే వాహన యజమాని కూడా బాధ్యుడు అవుతారని తెలిపారు. హెల్మెట్ ధరించడం బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలన్నారు.
గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటించడం, మోటారు వాహనచట్టాలను గౌరవించడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానల్ న్యాయవాది సి.హెచ్.స్వర్ణగౌరిమణి, అదనపు సివిల్ జెడ్జి బి.సూర్యకళ, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివిల్ జడ్జి

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంకు సంబంధించి బలిఘట్టం, గబ్బాడ సబ్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని డివిజనల్ ఇంజనీర్ విడివి.రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్, సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బలిఘట్టం, బయపురెడ్డి పాలెం, మెట్టపాలెం, బెన్నవరం, ఏటిగైరంపేట, గబ్బాడ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని చెప్పారు. వినియోగదారులు ఈ విషయాన్ని పరిగణలోనికి తీసుకొని సహకరించాలని ఆయన కోరారు.



సత్కరిస్తున్న జనసేన నేత శివదత్

కోదండరావుకు సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి: మత్స్యకారుల జీవన మనుగడ పుస్తకం రచించిన మత్స్యకార జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పిక్కి కోదండరావును జనసేన నాయకులు ఘనంగా సత్కరించారు. మత్స్యకారుల పుట్టుక, వికాసం, అభివృద్ధి అనే అంశంపై పుస్తకాన్ని కోదండరావు రచించారు. ఈ మేరకు నక్కపల్లి లో జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి కోదండరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కురుందాసు అప్పలరాజు, పాము గణేష్, సత్య, రాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి వడ్డాది: బుచ్చయ్య పేట మండలం వడ్డాది సెక్టర్ పరిది లోపూడి 1.2, వడ్డాది, ఎల్ సింగ వరం అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు, గ్రామీణ మహిళలకు "మిషన్ శక్తి" లో భాగమైన "భారతీయ న్యాయ సంహిత" చట్టాలపై ర్యాలీ లు నిర్వహించి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సూపర్వైజర్ రాజేశ్వరి మాట్లాడుతూ, స్త్రీలు, పిల్లల పై జరుగుతున్న నేరాలు, వాటికి సంబంధించిన శిక్షలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్వాడి లబ్ధిదరులైన గర్భిణీ, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్‌లు కామాక్షి, వైద్య సిబ్బంది ప్రభ, అంగన్వాడి సిబ్బంది మణి, లలిత, వెంకటలక్ష్మి, జ్యోతి, వరహాలమ్మ, అరిపాక కామేశ్వరరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు



ర్యాలీ చేపడుతున్నఅంగన్‌వాడీ కేంద్రం, వైద్య సిబ్బంది